


ఉష్ణోగ్రత (అంచనా)

| 22-5-2025 | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| గుంటూరు | 38 | 26 |
| తెనాలి | 37 | 29 |
| నరసరావుపేట | 38 | 28 |
| బాపట్ల | 36 | 29 |
| రెంటచింతల | 37 | 28 |
| చీరాల | 36 | 29 |

# నరసరావుపేటే మిగిలింది..!



● చిలకలూరిపేట ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు

- నేషనల్ హైవే భూ సేకరణ జఠిలం..!
- హైకోర్టులో రైతుల పిటిషన్‌లు
- పరిహారంపై ఒప్పందం చేయాలని పట్టు
- అంగీకరించని అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వాడరేవు - పొందుగల 167ఏ జాతీయ రహదారి భూ సేకరణ జఠిలమవుతోంది. నరసరావుపేటలో నష్టపరిహారం విషయంలో అధి కార యంత్రాంగం, రైతుల మధ్య వివాదం కొనసా గుతోంది. భూ సేకరణపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ.. రైతులు హైకోర్టును ఆశ్ర యించారు. పిటి షన్లను ఉపసంహరించుకోవాలని రైతులతో ఉన్నతాధికారులు జరిపిన చర్చలు విఫల మ య్యాయి.

**వేగంగా ఫేజ్ 1 పనులు**

బాపట్ల జిల్లా వాడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డరోడ్డు వరకు రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. 85 కిలో మీటర్లు పొడవునా రూ.1,064 కోట్ల వ్యయంతో ఈసీపీ విధానంలో రహదారి నిర్మాణాన్ని కేంద్రం చేపట్టింది. జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్) పనులు నిర్వహిస్తోంది. రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు రూ.678 కోట్లతో 47 కిలో మీటర్ల ప్యాకేజీని ఆర్‌ఆర్‌ఎస్‌ఎం సంస్థ చేపట్టింది.

## ● వివాదంగా 279.16 ఎకరాల భూసేకరణ

నరసరావుపేటలో రహదారి నిర్మాణానికి 279.16 ఎకరాల భూమి అవసరం. ఈ మేరకు సర్వే పూర్తి చేసి సంబంధిత రైతులకు భూసేకరణ నోటీసులు జారీ చేశారు. భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న బాధితులతో ఆర్డీవో కా ర్యాలయంలో ఇటీవల సమావేశం నిర్వహించారు. నరస రావుపేట పట్టణం పరిధిలో ఉన్న వ్యవసాయ భూమికి రిజిస్ట్రేషన్ విలువపై రెండు రెట్లు, జొన్నలగడ్డ, కేసానుపల్లి, రావిపాడు, గుంట గార్లపాడు గ్రామాల పరిధిలోని భూములకు రిజిస్ట్రేషన్ విలువపై రెండున్నర రేట్లు పరిహారం చెల్లిస్తామని ఆర్డీవో బాధితులకు తెలిపారు. ప్రధాన రహదారి వెంట ఉన్న ఇళ్ల స్థలాలకు గజానికి రూ.19 వేలు, రహదారికి లోపల ఉన్న ఇళ్ల స్థలాల కు రూ.16 వేలు చెల్లిస్తామని ఆర్డీవో వివరించారు. ఎకరాకు సుమారు రూ.1.75 కోట్లు పరిహారం చెల్లిస్తామని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత పత్రాలను అధికారులు స్వీకరించారు. ఆర్డీవో ప్రకటించిన విధంగా లిఖిత పూర్వకంగా ఒప్పంద పత్రాలు ఇస్తే భూములు.. స్థలాలు ఇస్తా మని బాధితులు చెబుతున్నారు. లిఖితపూర్వకంగా ఇవ్వలేమని.. నదరు ధరలను నేషనల్ హైవే అథార్టీ అధికారులకు ప్రతిపాదిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కోర్టులో కేసులు ఉపసంహరించుకోవాలని సూచించారు. పరిహారం లిఖిత పూర్వకంగా ఒప్పంద పత్రాలు ఇవ్వాలని బాధితులు కోరడంతో.. ప్రతిష్టంభన కొనసాగుతోంది. నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలో 85.39 ఎకరాలు, జొన్నలగడ్డలో 37.15, నరసరావుపేటలో 33.55, గుంటగార్లపాడులో 39.85, రావిపాడు గ్రామ పరిధిలో 83.22 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

167ఏ జాతీయ రహదారి పనులు బాపట్ల జిల్లా పరిధిలో వేగంగా జరుగుతున్నాయి. పల్నాడు జిల్లాలో నరసరావుపేటలో మినహా మిగతా ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. కొన్ని చోట్ల రైతుల బ్యాంకు ఖాతాల్లో నష్టప రిహారాన్ని కూడా జమ చేశారు. ఎటొచ్చి నరసరా వుపేటలో బైపాస్ భూసేకరణ మొదటి నుంచి వివాదంగానే ఉంది. సర్వే రాళ్లను తొలగించడం, భూముల్లో మార్కింగ్ చేయకుండా రైతులు అడ్డుకుంటూ వస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు మాత్రం అలైన్‌మెంట్ మార్చ డం కుదరని పని అని రైతులకు తేల్చిచెప్పారు.

## ● చిలకలూరి పేటలో..

చిలకలూరిపేట కొత్త బైపాస్ నుంచి అడ్డరోడ్డు వరకు భూసేకరణ చేయాల్సి ఉంది. టెండర్ ప్రక్రియ పూర్తయింది. కావూరు నుంచి కన పర్రు వరకు భూసేకరణకు రైతులు అంగీకరించారు. కొందరు రైతు లకు నష్టపరిహారం వివరాల నోటీసులు కూడా అందజేశారు. కావూరులో 49.15, నాదెండ్ల మండలం గోవిందాపురంలో 43.76 ఎకరాలు, గణపవరంలో 5.80, ఇర్లపాడు 14.66, కనపర్రులో 4.91, రొంపిచర్ల మండలం మాచవరం పరిధిలో 11.28, విప్పర్లలో 24.58, నకరికల్లు మండలం రూపెనగుంట్లలో 43.23, చల్లగుండ్లలో 66.80 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇందుకు రైతులు కూడా సానుకూలంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. తర్వలోనే భూమిని కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఎన్‌హెచ్‌ఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఫేజ్-2లో ఇలా..**

రెండవ ప్యాకేజీలో రహదారి నిర్మాణానికి టెండర్లు నిర్వహించారు. చిలకలూరిపేట కొత్త బైపాస్ దగ్గర నుంచి ఈ పనులు ప్రారంభమవుతాయి. ఇందులో పాత రహదారిని విస్తరిస్తారు. ఈశ్వర కళాశాల దగ్గర కుడి వైపునకు నరసరావుపేట బైపాస్ ప్రారంభమవుతుంది. 14.4 కిలోమీటర్ల బైపాస్ నిర్మిస్తారు. కుప్పగంజి వాగు మీదుగా టిడ్కో ఇళ్ల సమీపంలో రైల్వే లైన్ వద్ద ఆర్‌వోబీని, నరసరావుపేట -గుంటూరు రోడ్డు వద్ద ఫ్లైఓవర్, ఇస్సపాలెం దగ్గర సత్తెనపల్లి రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తారు. రావిపాడు తర్వాత ఉన్న రహదారిలో కలుస్తుంది. అక్కడ నుంచి ఉన్న రహదారిని విస్తరిస్తారు. అడ్డరోడ్డు దగ్గర బైపాస్ నిర్మిస్తారు. ఇదే గ్రామం వద్ద ఇంటర్ చేజ్ నిర్మించి అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో కలుపుతారు.

# యోగాంధ్ర విజయవంతానికి కృషి

- ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవతేజ
- యోగాంధ్ర మాసోత్సవాలు ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ, పాల్గొన్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాదు, డీఆర్వో ఖాజావలీ తదితరులు



చిన్నారుల ప్రదర్శన



యోగా చేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ భార్గవతేజ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ తదితరులు

గుంటూరు(తూర్పు), మే 21(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు యోగా సాధనపై జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యోగ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. యోగాంధ్ర-2025 థీమ్‌తో వివిధ ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రముఖులు, మహిళలు, విద్యార్థులు, ఇతర రంగాలకు చెందిన వ్యక్తులతో ప్రజలను యోగాకు సన్నద్ధం చేసేలా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. యోగాపై అవగాహన, ఆసక్తి కలిగించే ఉద్దేశంతో అవగాహన ర్యాలీలు, మారథాన్, రంగోలి, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. యోగాంధ్రాను విజయవంతం చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన యోగాసనాలు వేశారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగసనాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ, మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ సజీల, డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీఓ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు దామచర్ల శ్రీనివాస్, షేక్ లాల్‌వజీర్ పాల్గొన్నారు.

# మహిళల భద్రత కోసమే మహిళా కమిషన్

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ
- గుంటూరు, నంబూరులో శక్తి సదన్ల పరిశీలన

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దాడులకు, అన్యాయానికి గురైన మహిళలకు భరోసా, భద్రత కల్పించి వారికి న్యాయం చేయడమే రాష్ట్ర మహిళా కమిషన్ ప్రధాన ఏజెండా అని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. నంబూరులోని జేఎంజే శక్తి సదన్, గుంటూరు మహిళా ప్రాంగణంలోని శక్తి సదన్, ఒన్ స్టాప్ సెంటర్లను బుధవారం ఆమె సంద ర్శించారు. శక్తి సదన్‌లో వసతి పొందుతున్న మహి ళలతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. అన్యాయానికి గురైన మహిళలకు భద్రత, భరోసా కల్పించి, వారిని సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా నడపటానికి ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'మిషన్ శక్తి'లో శక్తి సదన్‌లు నడుస్తున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా 441, రాష్ట్రంలో 27 శక్తి సదన్లు ఉన్నాయని తెలిపారు. వాటి నిర్వహణకు కేంద్ర 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం తగ్గకుండా మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తుందన్నారు. గత ఐదేళ్లు.. శక్తి సదన్లకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ మంజూరు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం కనీసం మ్యాచింగ్ గ్రాంట్ మంజూరు చేయలేదని తెలిసిందన్నారు. కూటమి ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న నాలుగు మ్యాచింగ్ గ్రాంట్లను విడుదల చేసిందని చెప్పారు. గత ప్రభుత్వంలో అమరావతిలో మహిళలపై జరిగిన దాడులపై జాతీయ మహిళా కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సెక్రటరీ బి.వసంత బాలా, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరక్టర్ విజయలక్ష్మి, మహిళా ప్రాంగణం మేనేజరు రమణశ్రీ, ఏడీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



శక్తి సదన్‌ను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ రాయపాటి శైలజ

# ఓటర్ జాబితాను మరింత మెరుగుపరుస్తాం

- ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా రూపకల్పన మరింతగా మెరుగుపర్చాలనే ఉద్దేశంతో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి నెలా సమా వేశం నిర్వహించి, సలహాలు, సూచనలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ మినీ హాల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో కె.శ్రీనివాసరావుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమా వేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని బీఎల్‌ఓల జాబితా అందించాలని కోరారు. అలాగే ఎన్నికల్లో దొంగ ఓట్లు వేసిన వారిపై పోలీస్‌స్టేషన్ల లో కేసులు ఫైల్ చేయడం జరిగిందని, ఇంత వరకు చర్యలు తీసుకోలేదని.. దీనిపై ప్రస్తుత పరిస్థితి తెలియజేయాలని కోరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల లోపు ఓటరు కార్డు ఆధార్ కార్డుకు అనుసంధానం చేయించాలని కోరారు. క్లెయిమ్స్ వెరిఫికేషన్‌కు వెళ్లేటప్పుడు బీఎల్‌ఏలను కూడా తీసుకువెళ్లేలా చూడాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన పలు అంశాలపై ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు కార్డు ఆధార్ కార్డుకు అనుసంధానం అంశంపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. బీఎల్వోల జాబితాను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందిస్తామన్నారు. 2026 జనవరి 5న ఓటరు జాబితా రూపొందించడం జరుగుతుందని, దాని ప్రకారం స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. గత సమావేశం మినిట్స్ ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించారు. డాక్టర్ తాతా సేవాకుమార్(ఆప్), వైవీ సుబ్బారావు(బీజేపీ), బిళ్లా సునీల్ కుమార్(కాంగ్రెస్), నాయుడు ఓంకార్ (టీడీపీ), సీహెచ్ త్రినాథరావు(జనసేన), వె.కృష్ణ కాంత్(సీపీఎం), ఈఆర్వోలు గంగ రాజు, లక్ష్మీ కుమారి, డీఆర్డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి, ఏఈఆర్‌ఓలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# కనుల పండువగా.. హనుమజ్జయంతి



తమల పాకులతో పూజ

గుంటూరు కార్పొరేషన్, మే 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు పట్టణం కొత్తపేటలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పంచామృత స్నపన, లక్ష తమలపాకులతో పూజా కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. మంగళ వాయిద్యాలు, వివిధ వేషధారణలు, 108 మంది మహిళల కోలాటం, దీపాలంకరణలతో వైభవంగా స్వామి వారి గ్రామోత్సవం హనుమాన్ దీక్ష సమాజం ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర పర్యవేక్షించారు.



రథోత్సవంలో మహిళల కోలాటం

# తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీక టీడీపీ

**ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్**

తాడికొండ, మే 21(ఆంధ్రజ్యోతి): తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా పుట్టిన పార్టీ, పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించే పార్టీ తెలుగుదేశం అని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం తాడికొండ నియోజకవర్గం మినీ మహానాడు గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పునాదులు వేసి, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవబోతుందన్నారు. రాజధాని ఉద్యమంలో పాల్గొని వైసీపీ అరాచక పాలన నుంచి అమరావతిని కాపాడిన రైతులు పుట్టిన నియోజకవర్గం తాడికొండ అని అన్నారు. గత వైసీపీ హయంలో పేదలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. రాజధాని అమరావతిలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ చేతుల మీద ప్రారంభించడం చూశామన్నారు. తెలుగుదేశం పార్టీ లక్ష్యాలను, ఆదర్శాలను ప్రజల్లోకి మరింత ఉత్తేజంతో తీసుకెళ్లేందుకు మహానాడు ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య తీర్మానాలను ప్రవేశపెట్టారు. నియోజకవర్గ పరిశీలకులు చిరుమా మిల్ల మధు, దామినేని శ్రీనివాసరావు, నూతల పాటి రామారావు, పుట్టి రామచంద్రరావు, తలశిల ప్రసన్న కుమార్, వెంకట సుబ్బారావు, రమేష్‌బాబు, చిన నరసింహరావు, అబ్దుల్ ఘనీ,జానీ బేగం, ఏసు బాబు, అనూఫ్, మధు సూదనరావు, కృష్ణారావు, రిజ్వాన పాల్గొన్నారు.





మిని మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

## తిరుపతి, ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌లకు అదనపు బోగీలు

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ పెరిగిన కారణంగా తిరుపతి, ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు బోగీలను రైల్వే శాఖ ఏర్పాటు చేసింది. (17253/17254) గుంటూరు - ఔరంగబాద్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు స్లీపర్ క్లాస్, (17261/17262) గుంటూరు - తిరుపతి - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు స్లీపర్, జనరల్ బోగీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా బెర్తులు, సీట్లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి.

## పల్లెల్లో ప్రశాంతత నెలకొల్పాలి : పల్నాడు ఎస్పీ


పల్లె నిద్రలో పాల్గొన్న ఎస్పీ శ్రీనివాసరావు

వెల్దుర్తి, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ఘర్షణలకు దూరంగా ఉంటూ పల్లెల్లో ప్రశాంతతను నెలకొల్పాలని జిల్లా ఎస్పీ కంచె శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గుండ్లపాడులో బుధవారం రాత్రి ఆయన పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు ఘర్షణల జో లికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఐక్యమత్యంతో ఉంటూ గ్రా మాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. జోరు వానలోనూ గొడుగు సాయంతో గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో ని సచివాలయంలో పల్లె నిద్ర చేశారు. ఎస్పీ వెంట గురజాల డీఎస్పీ హనుమంతురావు, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, వెల్దుర్తి ఎస్ఐ సమందర్ వలి, సిబ్బంది ఉన్నారు.





# కాసులిస్తేనే కనెక్షన్..!



● వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో చేతివాటం ● క్షేత్రస్థాయిలో ఆపరేషన్ అధికారులపై ఆరోపణలు ● పేరుకుపోతున్న దరఖాస్తులు ● ఉమ్మడి జిల్లాలో 4 వేలకు పైనే పెండింగ్

గుంటూరు, మే 21(ఆంధ్రజ్యోతి): కాసులిస్తే రోజుల వ్యవధిలోనే కనెక్షన్‌లు. లేకుంటే ఏదో ఒక కొర్రీతో కాలం వెళ్లదీయడం... ఇదీ వ్యవసాయ కనెక్షన్‌లలో క్షేత్రస్థాయి విద్యుత్ శాఖ ఆపరేషన్ అధికారుల తీరుపై వెల్లువెత్తుతోన్న ఆరోపణలు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు కావాలంటే ఆ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వ్యవసాయ కనెక్షన్‌లు త్వరితగతిన అందించాలని పదే పదే ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆపరేషన్(ఓ అండ్ ఎం) అధికారులు మాత్రం 'చేయి తడపనిదే.. మాకేంటి' అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం విద్యుత్ శాఖకు డిపాజిట్లు కూడా చెల్లించిన దరఖాస్తులు 2024-25కు సంబంధించి 4 వేలకు పైనే ఉన్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇక గత 2023-24 సంబంధించి ఇంకా 60 పైనే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

### డిపాజిట్లు చెల్లించినా..

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం రైతులు దరఖాస్తులు చేసుకోగా ప్రతిపాదనలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, ఎర్త్ పైపులు వంటి అనేక పరికరాల కోసం డిపాజిట్లు చెల్లించాల్సి ఉంటుంది. రైతులు పక్కాగా డిపాజిట్లు చెల్లించినప్పటికీ ఏదో ఒక సాకుతో కాలం వెళ్లదీస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ కనెక్షన్‌లపై క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు దరఖాస్తు దారులు స్థానిక అధికారులను కలిసి కాసులిస్తేనే కరుణిస్తారన్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సబ్ డివిజన్‌లలో దరఖాస్తు చేసుకున్న కనెక్షన్లకు సామగ్రి డ్రా చేసినట్లుగా ఉంటోంది. క్షేత్రస్థాయిలో మాత్రం వేరొకరికి కనెక్షన్‌లు ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ తతంగమంతా స్థానిక అధికారులు, సిబ్బంది కనుసన్నల్లో జరుగుతోన్నట్లు ఆరోపణలున్నాయి.

### నందివెలుగు - అత్తోట మధ్యలో రైతులకు చుక్కలు...

తెనాలిలోని నందివెలుగు - అత్తోట మధ్యలో నలుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం గత ఏడాదిలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందు కోసం అధికారుల పంపిన నోటీసుల ప్రతిపాదనలకు అనుగుణంగా ఒక్కొక్కరు జూలైలో రూ. 18వేలకు పైనే చెల్లించారు. అక్కడి నుంచి తమకు అధికారులు చుక్కలు చూపించారని వారు వాపోతున్నారు. నాలుగు కనెక్షన్‌లకు గాను నేటికీ ఒక్క సర్వీసుకు మాత్రమే కనెక్షన్ ఇచ్చారని తెలిపారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేసిన నాలుగు నెలల తరువాత తిన్నగా విద్యుత్ పోల్స్ వేశారని చెప్పారు. మరో నెల తరువాత ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉంచారు. కొన్ని రోజుల తరువాత ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) ఏర్పాటు చేసి వైర్లు లేవని మరి కొంతకాలం జాప్యం చేశారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు ఇటీవల ఒక్క సర్వీసుకు కనెక్షన్ ఇచ్చారని, చివరగా వేరొక సర్వీసుకు ఏర్పాటు చేసిన పోల్స్‌ను కూడా లాక్కెళ్లారని సదరు రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఆయా సర్వీసుల విషయంలో క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం ఏబీ కేబుల్, సాధారణ కేబుల్, ఎర్త్ పైపులు కూడా డ్రా చేసినట్లు సమాచారం. అయినప్పటికీ నాలుగు సర్వీసులకు కనెక్షన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యమెందుకో పైఅధికారులకే తెలియాలి.

### ఎస్ఈ చెప్పినా బేఖాతరు

నంది వెలుగు - అత్తోట మధ్యలో వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన రైతులు పలు మార్లు తమ గోడును ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో ఎస్ఈ స్పందించి స్థానిక అధికారులకు గట్టిగా చెప్పినప్పటికీ స్థానిక అధికారులు లెక్కపెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

### ప్రభుత్వం మారినా వారే..

ఏపీ సీపీడీసీఎల్ ఉమ్మడి గుంటూరు జిల్లా సర్కిల్ పరిధిలోని పలు డివిజన్‌లలో ముఖ్యంగా ఆపరేషన్(ఓ అండ్ ఎం) విభాగంలో గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన వారే అత్యధిక శాతం కొనసాగుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులు నేటికీ అదే బాటలో నడుస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# జీరో, కటింగ్ బిజినెస్‌ల లెక్క తేల్చారు సరే...

● మరి బిల్ టూ బిల్, పార్టనర్‌షిప్ మార్పుల సంగతేమిటి? ● మచ్చుకాయల రూపంలోనూ పెద్దఎత్తున గోల్‌మాల్ ● వీటి పైనా విజిలెన్స్ రిపోర్టు ఇస్తే మొత్తం అవినీతి ఎంతనేది తేలుతుంది



గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇంకా కొన్ని లెక్కలు తేల్చాల్సి ఉన్నది. ఇప్పటివరకు కేవలం జీరో, కటింగ్ బిజినెస్‌ల ద్వారా గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, వాణిజ్య పన్నుల శాఖలు కోల్పోయిన ఆదాయాన్ని మాత్రమే లెక్కించాయి. అయితే బిల్ టూ బిల్, మచ్చుకాయలు, లైసెన్సుల పేర్ల మార్పుల్లో జరిగిన అవినీతిని మాత్రం ఇంకా తేల్చాల్సి ఉన్నది. వాటి లెక్క కూడా పూర్తి అయితే అవినీతి దాదాపుగా రూ. 400 కోట్ల వరకు చేరొచ్చని అంచనా. వీటిని ఏ విధంగా రికవరీ చేస్తారనేది సస్పెన్స్‌గా మారింది. కాగా ఉద్యోగులపై చర్యలు తీసుకొన్నంత మాత్రాన యార్డు ఖజానాకు ఏమి ఒరగదు. ఆర్‌ఆర్ యాక్టు ప్రయోగించి రికవరీ చేస్తేనే ఉపయోకరమన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

మిర్చియార్డులో బిల్ టూ బిల్ వ్యాపారం పెద్దఎత్తున ఏడాది పొడవునా అన్ని పనిదినాల్లో కొనసాగుతుంటుంది. దీని వలన రైతుకు భారీగా నష్టం జరుగుతుంది. యార్డులో తగినంత ఆర్థికస్తోమత లేకపోయినా చాలామంది కమీషన్ ఏజంట్ లైసెన్సులు పొందారు. వాళ్ల వద్దకు వచ్చే మిర్చి టిక్కీలను అమ్మి పెట్టలేక పెద్ద కమీషన్ ఏజంట్లకు చెప్పి బిల్ టూ బిల్ రాయిస్తారు. ఇందుకు గాను రైతుల వద్ద 2 శాతానికి బదులు ఐదు శాతం కమీషన్ వసూలు చేస్తారు. ఇందులో 3 శాతం పెద్ద కమీషన్ ఏజంట్‌కు, 2 శాతం ఆర్థికస్తోమత లేని ఏజంట్‌కు చేరుతుంది. ఈ విధానం వలన మిర్చియార్డుకు ఎలాంటి నష్టం జరగడం లేదు కదా అని వ్యాపారస్థులు వాదిస్తుంటారు. యార్డుకు వచ్చే 1 శాతం మార్కెట్ ఫీజు వస్తుంది కదా అని ప్రశ్నిస్తుంటారు. అయితే రైతుకు చెల్లించే నగదులో మూడు శాతం అదనంగా కోత పెడతారు. దీని వలన కూడా మార్కెట్ ఫీజు, జీఎస్టీ రూపంలో గండి పడుతుంది. ఈ విధంగా బిల్ టూ బిల్ లావాదేవీలు 2019-24 మధ్యన ఎంతమేరకు జరిగాయో తేలిస్తే యార్డు ఆదాయానికి పడిన గండి ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉన్నది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో కమీషన్ ఏజంట్ల లైసెన్సులకు సంబంధించి పార్టనర్‌షిప్ మార్పులు 250కి పైగా జరిగాయి. ఇందుకోసం రూ. కోట్లలో నగదు చేతులు మారిందన్న ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. దీనిపై అప్పటి యార్డు ఛైర్మన్లను విజిలెన్స్ అధికారులు కలెక్టరేట్‌లోని ప్రాంతీయ కార్యాలయానికి పిలిపించి ఎంక్వయిరీ కూడా చేశారు. అయితే విజిలెన్స్ రిపోర్టులో ఎక్కడా ఈ బిల్ టూ బిల్, పార్టనర్‌షిప్ మార్పులు గురించి ప్రస్తావించలేదు. నిత్యకృత్యంగా మారిన మచ్చుకాయలు తీసే విధానం జోలికి కూడా విజిలెన్స్ వెళ్లలేదు. ఇవన్నీ లెక్కలు తేలిస్తే అవినీతి ఇప్పటికే లెక్కించిన రూ. 347.70 కోట్లకు అదనంగా మరో రూ. 100 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా.

# వేమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రకటన


అమ్మిశెట్టి కిషోర్


గంటా రమాదేవి


వట్టిప్రోలు సునీత

వేమూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. నూతన పాలకవర్గం తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు పదవిలో కొనసాగుతుందని ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ కమిటీ గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే ఆనందబాబు, పాలకవర్గ అధ్యక్షురాలిగా అమృతలూరుకు చెందిన గొట్టిపాటి జయ పూర్ణకుమారి, వేమూరు మండలం కాకర్లమూడికి చెందిన అమ్మిశెట్టి కిషోర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సభ్యులుగా.. మూల్పూరుకు చెందిన మొవ్వా శ్రీనివాసరావు, అమృతలూరుకు చెందిన కందుకూరి వెంకటేశ్వరమ్మ, వేమూరుకు చెందిన గంటా రమాదేవి, జంపనికి చెందిన వట్టిప్రోలు సునీత, చుండూరు మండలం మోదుకూరుకు చెందిన ఆళ్ల కోటిరెడ్డి, మండూరుకు చెందిన భార్గవి, కొల్లూరు మండలం జువ్వలపాలేనికి చెందిన భూపతి వెంకటేశ్వరరావు, గాజుల్లంకకు చెందిన సనకా నాగమణి, కొల్లూరుకు చెందిన పోతార్లంక కుటుంబరావు, భట్టిప్రోలు మండలంలోని ఆళ్లమూడికి చెందిన రాజుల వెంకటేశ్వరరావు, భట్టిప్రోలుకు చెందిన షేక్ జమీల, యర్రంశెట్టి సత్యనారాయణ, ఐలవరానికి చెందిన గట్టు రామలక్ష్మి సభ్యులుగా నియమితులయ్యారు. వీరితో పాటు భట్టిప్రోలు పీఏసీఎస్ అధ్యక్షులు, వేమూరు సర్పంచ్, రేపల్లె వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా మార్కెటింగ్ సొసైటీ అధికారి సభ్యులుగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మహానాడు కార్యక్రమం అనంతరం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం ఉంటుందని సమాచారం. నూతన పాలక వర్గం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపింది.

## కిల్కారి సేవలను పరిశీలించిన ఆర్మాన్ కేంద్ర బృందం


ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

గుంటూరు మెడికల్, మే 21 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న కిల్కారి కాల్స్ సేవలను బుధవారం ఆర్మాన్ కేంద్ర బృందం పరిశీలించింది. తొలుత బృంద సభ్యులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి కిల్కారి సేవల అమలు తీరు వివరించారు. అనంతరం ఈ బృందం సంగం జాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో కిల్కారి ప్రోగ్రాం అమలు తీరును గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ఆశలు, ఆరోగ్య కార్యకర్తలు ఏవిధంగా సేవలు అందిస్తున్నారు... కిల్కారి మొబైల్ కాల్స్ ఆరోగ్య సంరక్షణలో ఏ మేరకు ఉపయోగపడుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మాతా శిశుమరణాలు తగ్గించేందుకు కిల్కారి ఫోన్ కాల్స్ సేవలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు ఈ బృందం సభ్యులు గర్భిణలకు వివరించారు. 01244451660 అనే నంబరు నుంచి కిల్కారి ఫోన్ కాల్స్ వస్తాయని, ఈ కాల్స్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య సమాచారాన్ని అందిస్తారని వివరించారు. బృందం వెంట డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డీఐవో డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

## ఇంటెల్ సంస్థతో ఎన్ఈసీ అవగాహన ఒప్పందం


ఇంటెల్ ప్రతినిధులతో ఎన్ఈసీ కళాశాల వైస్ చైర్మన్ చక్రవర్తి

నరసరావుపేట రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి):నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల మైక్రోప్రాసెసర్ సంస్థ ఇంటెల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఘనత సాధించిన తొలి ఇంజనీరింగ్ కళాశాలగా నరసరావుపేట కళాశాల నిలిచిందని వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా "ఇంటెల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్"ను ఆనంద్ కులకర్ణి, కస్టమర్ ఇంజనీరింగ్ లీడ్, ఇంటెల్ (బెంగళూరు) కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కులకర్ణి మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, శిక్షణలు, ప్రాజెక్టులు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు ఇంటెల్ సర్టిఫికేషన్లు వంటి అనేక అవకాశాలు ఈ ఒప్పందం ద్వారా అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. మొదటి విడతలో 50 మం ది విద్యార్థులు ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తి చేశారని, మరో 50 మంది రెండో విడతకు ఎంపికయ్యారన్నారు. కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, సెక్రటరి మిట్టపల్లి రమేష్‌బాబు ఈ ఇంటర్నేషనల్ భాగస్వామ్యాన్ని కళాశాల అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా పేర్కొన్నారు.

## కారు ఢీకొని కూలి మృతి : మరొకరికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృ తి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో బుధవారం జరిగింది. వివరాల మేరకు.. సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన శ్రీనివాస్(37), జోసెఫ్ కూలీ పనుల నిమిత్తం తమ ద్విచక్ర వాహ నంపై సత్తెనపల్లి పట్టణంలోని గడియార స్తంభం దగ్గరకు వచ్చారు. ఇదే సమయం లో ఎదురుగా వసస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. బైక్ పై ప్రయాణిస్తున్న శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా.. జోసెఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జోసెఫ్ ను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. జోసెఫ్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 125, 134, 145 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 236.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 246.00 |

### సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 512.60 అడుగులు ఉంది. ఇది 136.12 టీఎంసీలకు సమానం.



# ముగిసిన ఎన్టీఆర్ కళా పరిషత్ నాటిక పోటీలు

వినుకొండటౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్య మంత్రి స్వర్గీయ ఎన్‌టీఆర్ వజ్రోత్సవాల్లో భాగంగా స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్‌టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన నాటక పోటీలు పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ సన్నివేశాల్లో మహిళలు, చిన్నారుల కళా ప్రదర్శన అలరింపజేసింది. చివరి రోజు హైదరాబాద్ వారి విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ స్వేచ్ఛ నాటిక, 2వ ప్రదర్శనగా సౌజన్య కళాస్రవంతి ఉత్తరాంధ్ర వారి దేవరాగం నాటిక, 3వ ప్రదర్శనగా విశాఖపట్నం వారి భద్రం ఫౌండేషన్ ప్రదర్శించిన దొందూదొందే హాస్య నాటికలను ప్రదర్శించారు. నాటిక పోటీలకు సహకరించిన దాతలను నిర్వాహకులు శాలువాలతో సన్మానించి, అభినందించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కళలకు వినుకొండ పెట్టింది పేరు అని, జాషువా పుట్టిన గడ్డపై ఇలాంటి ప్రదర్శనలు ఎన్నో కొనసాగాలన్నారు. ముత్తినేని గిరిబాబు, బొల్లా వెంకటకోటయ్య, న్యాయవాది రామకోటేశ్వరరావు, లగడపాటి వెంకట్రావు, ఏజీపీ ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావు, కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తితో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.


దేవరాగం నాటికలోని ఓ సన్నివేశం


స్వేచ్ఛ నాటికలోని ఓ సన్నివేశం

# గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



## దుకాణాల వద్ద రేషన్ పంపిణీకి ఏర్పాట్లు చేయాలి

● మంత్రి మనోహర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం తీసుకొన్న నిర్ణయం మేరకు జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్దనే సరుకుల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవతేజ, పౌరసరఫరాల అధికారులతో మాట్లాడారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ 65 సంవత్సరాల పైబడిన లబ్ధిదారులు, అంగవైకల్యం కలిగిన లబ్ధిదారులకు మాత్రం ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీ చేయడా నికి చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ కార్డులు దాఖలు చేసే ప్రక్రియలో ప్రజలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు కొంత వెసులుబాటును కలిగించాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత సున్నితమైనందున, లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిత్యా వసర సరుకుల పంపిణీ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్, జిల్లా పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

## మూడొంతెనల వద్ద డ్రైనేజీ సమస్యకు చర్యలు చేపట్టాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూడొంతెనల దగ్గర డ్రైనేజీ సమస్య లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నగరపాలక సంస్థ ఇంజనీ రింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలకసంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మూడొంతెనల దగ్గర పర్యటించి వర్షపునీరు నిలబడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ శంకర్‌విలాస్ ఆర్‌వోబీ తరువాత గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలకు అతి ముఖ్యమైన వారధిగా మూడు వంతెనల మార్గం ఉందని, త్వరలో ఆర్‌వోబీ పనులు ప్రారంభిస్తే ట్రాఫిక్ మళ్లింపునకు కూడా ఇదేమార్గం అవుతుందన్నారు. కాని చిన్నపాటి వర్షానికి కూడా ఈ ప్రాంతం బురదతో మునుగుట వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణం మురుగు నిలవకుండా డ్రెయిన్ నిర్మాణం చేయాలని, స్థలసేకరణ జరి గిన ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. అవుట్ ఫాల్ డ్రెయిన్ వెంట్ కూడా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న డ్రెయిన్లు, కల్వర్టుల వద్ద సిల్ట్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సదరు పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, కార్పొరేటర్ ఈరంటి వర్రప్రసాద్, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈలు హనీఫ్, నాగభూషణం, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మూడొంతెనల దగ్గర డ్రైనేజీ పరిశీలిస్తున్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏఐ హ్యాకథాన్

● వచ్చే నెల 27 నుంచి 29 వరకు గుంటూరులో కార్యక్రమం

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వచ్చే నెల 27 నుంచి మూడు రోజుల పాటు జాతీయ స్థాయిలో పోలీస్‌శాఖ ఆద్వర్యంలో ఏఐ హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు డీజీపీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంబించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధికారిక హోస్టింగ్ పార్టనర్ గా వ్యవహరించనుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, రాష్ట్ర ఉన్నతాధికారులు, దేశవ్యాప్తంగా ఉన్న ఐటీ రంగ ప్రముఖులు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

## ఆర్‌వీఆర్‌ఆర్ బీఈడీ కళాశాలకు న్యాక్ 'బి' గ్రేడ్

గుంటూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని రాయ పాటి వెంకట రంగారావు (ఆర్‌వీఆర్‌ఆర్) విద్యా కళాశాలకు న్యాక్ 'బీ' గ్రేడ్ లభించినట్టు కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నెల ఎని మిది, తొమ్మిదో తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా ముగ్గురు సభ్యుల బృందం పరిశీలించి, న్యాక్ గుర్తింపుని ఇచ్చారని తెలిపారు. కేవలం బీఈడీ కోర్సును మాత్రమే నిర్వహిస్తూ, తాము ఈ గ్రేడ్‌ని సాధించామన్నారు. తమ కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడానికి కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని ఆయన అభినందించారు.

## బీసీలకు రక్షణ చట్టం చేయాలి

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతికుమార్

గుంటూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో హామీ మేరకు కూటమి ప్రభు త్వం బీసీలకు రక్షణ చట్టం చేసి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వెనకబడిన తరగతుల(బీసీల)పై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టసభల్లో 33%, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో బీసీలు 52 శాతంగా ఉన్నారని, వారంతా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో వెనకబాటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల విద్యాలయాలు, స్టడీ సర్కిల్స్, వసతి గృహాలను సౌకర్యాలతో బీసీ విద్యార్థులకు నిర్మించాలని క్రాంతికుమార్ కోరారు. విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, తెనాలి నియోజకవర్గం బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వేములకృష్ణ ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్ తదితరులు

## ఏలూరి సూర్యనారాయణకు తానా ఆహ్వానం


సూర్యనారాయణ

గుంటూరు(తూర్పు), మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సమాజ సేవకులు, ఆర్య సమాజం ముఖ్య ప్రచారకులు ఏలూరి సూర్యనారాయణకు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) నుంచి ఆహ్వానం అందుకున్నారు. జూలై 2, 3, 4 తేదీల్లో జరిగే తానా మహాసభలకు ప్రత్యేక అతిథిగా ఆయన్ను ఆహ్వానించారు. సూర్యనారాయణ అనేక ప్రజాహిత కార్యక్రమాల్లో వైదిక సాహిత్య ప్రచారంతో పాటు ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించడం, వసతి గృహంలో స్థానం కల్పించడం వంటి సేవా కార్యక్రమాల్లో నిరంతరం పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఏలూరు సూర్యనారాయణకు పలువురు అభినందనలు తెలిపారు.

## సర్వీసు పెన్షనర్ మరణిస్తే భార్యలకు కుటుంబ పెన్షన్

● ఈదర వీరయ్య

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): సర్వీసు పెన్షనర్‌కు చట్టబద్ధమైన భార్యలు ఒకరికి కంటే ఎక్కువ ఉంటే ఆ పెన్షనర్ మరణానంతరం కుటుంబ పెన్షన్ వారికి సమాన వాటాలో చెల్లిస్తారని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చట్టబద్ధత అంటే సర్వీసు పెన్షనర్ సర్వీసులో ఉండగా తన మొదటి భార్య దాంపత్య జీవితానికి అర్హురాలు కాదని ఆమెకు మానసిక పరిస్థితి సరిగా లేదని, సంతాన యోగం లేదని నిపుణులైన డాక్టర్ల బృందం (మెడికల్ బోర్డు) ధ్రువీకరణ పత్రం ఇస్తే తనకు సంతానం కావాలని కోరిక ఉంది అని రెండో వివాహం చేసుకుంటానని ప్రభుత్వానికి మెడికల్ బోర్డు ఇచ్చిన ధ్రువీకరణ పత్రం జతచేసి అర్జీ పెట్టుకోవాల్సి ఉంటుందన్నారు. దానిని అనుసరించి ప్రభుత్వం రెండో పెళ్ళి చేసుకోవడానికి అనుమతి ఇస్తే ఆ విషయాన్ని సర్వీసు రిజిష్టరులో నమోదు చేసుకోవాలన్నారు. భార్యభర్తలు ఇరువురు పెన్షనర్లు అయి అందులో ఒకరు మరణించినచో అతని/ఆమె, భార్య/భర్తకు కుటుంబ పెన్షన్ చెల్లిస్తారన్నారు. అనగా తన పెన్షన్‌కు తోడు తన భర్త/భార్య ఫ్యామిలీ పెన్షన్ కూడా పొందవచ్చన్నారు. భార్య లేక భర్త ఉద్యోగం చేస్తూ మరణించిననూ తన భర్త/భార్య ఫ్యామిలీ పెన్షన్ కూడా పొందవచ్చని తెలిపారు. రెండు పెన్షన్లు తీసుకోవటానికి ఆ రెండు పెన్షన్లపై కరువుభత్యాలలో ఏదీ హెచ్చు మొత్తమో ఆ డీఆర్‌ను ఎంచుకొని తీసుకోవచ్చన్నారు. కుటుంబ పెన్షన్ పొందుతూ, రిటైర్డ్ అయిన తరువాత పునర్వివాహం చేసుకుంటే పెన్షనర్‌కు కలిగిన సంతానానికి కూడా కుటుంబ పెన్షన్ చెల్లిస్తారన్నారు. సర్వీసు పెన్షనర్ రిటైర్డ్ అయిన తరువాత చట్టబద్ధమైన వివాహం చేసుకున్నట్లయితే అతడు లేక ఆమె కుటుంబ పెన్షన్‌కు అర్హులని వీరయ్య తెలిపారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు అన్యాయం

● ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు ప్రవళిక

గుంటూరు సిటీ, మే 21(ఆంధ్రజ్యోతి): 24 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్ర అధికారులు స్పందించకుండా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు టీ ప్రవళిక అన్నారు. గుంటూరు కలె క్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో బుధవారం ఆమె మాట్లాడుతూ అధికారులు 20వ తేదీన చర్చలకు పిలిచి తీవ్ర అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. ఒక్క సమస్యకు కూడా పరిష్కారం చూపకుండా సమ్మె విరమించాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న మిగిలిన ఉద్యోగు లకు ఇచ్చిన విధంగా 23 శాతం జీతాలు పెంచటంతో పాటు, పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 6 సంవత్సరాల నుంచి సర్వీస్ చేస్తున్న వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సంధ్య, ఉపాధ్యక్షురాలు వనజ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్

## ధనుంజయరెడ్డికి ఉత్తమ కవి ప్రతిభా పురస్కారం


ధనుంజయరెడ్డి

గుంటూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ఫేస్ బుక్ 'అమరావతి సాహితీ మిత్రులు' గ్రూపులో డాక్టర్ రావి రంగారావు 2024 నుంచి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్కుషాపుల్లో 2025 'వారం వారం కవితల వర్కుషాప్' ఏప్రిల్ నెలలో ఉత్తమ కవి ప్రతిభా సత్కారానికి గుంటూరుకు చెందిన ధనుంజయరెడ్డి ఎంపికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 ఏప్రిల్‌లో జరిగిన నాలుగు వారాల వర్కుషాపుల్లో ఏ వారానికి ఆ వారం ఉత్తమ కవుల్ని ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందించారని తెలిపారు. నాలుగు వారాల వర్కుషాపుల్లో ఉత్తమ కవిగా ధనుంజయ రెడ్డిని ప్రతిభా సత్కారానికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు, జూన్ నెలలో జరిగే అమరావతి సాహితీ మిత్రులు సభలో సత్కరించనున్నట్లు సంస్థ అధ్యక్షులు రావి రంగా రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. 'మానవత' సేవా సంస్థలో కూడా ధనుంజయ రెడ్డి విశేష సేవలందిస్తున్నారు.


శ్లోక అహల్య భాయ్ జయంత్ ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ మహిళా నాయకులు

## శ్లోక అహల్య భాయ్ జయంత్ సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), మే 21(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో 200 పైగా దేవాలయాల నిర్మాణంతో పాటు ఘాట్ రోడ్లు, సత్రాలు నిర్మించిన గొప్ప వ్యక్తి అహల్య భాయ్ అని బీజేపీ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు నాగ మల్లేశ్వరి యాదవ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధ వారం నుంచి మే 31 వరకు పుణ్య శ్లోక అహల్య భాయ్ జయంత్ ఉత్సవాలను స్థానిక డొంక రోడ్‌లో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అహల్య భాయ్ చిన్న వయసులోనే భర్తని, కుమారుడిని కోల్పోయినప్పటికి ధైర్య సాహసాలతో ప్రజల హక్కుల కోసం పోరాడిందని గుర్తు చేశారు. ఆమె జీవిత చరిత్ర గురించి అందరూ తెలుసుకునేందుకు పదిరోజుల పాటు ఉత్సవాలు జరుపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సుగుణ, జూపూడి భవాని, వాణి తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక రంగంపై మాజీ ప్రధాని రాజీవ్ చెరగని ముద్ర

● ఏఐసీసీ కార్యదర్శి ఉషారాణి

గుంటూరు, మే 21(ఆంధ్రజ్యోతి): దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగం అభివృద్ధి సాధించ డంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీది చెరగని ముద్ర అని ఏఐసీసీ కార్యదర్శి, గుజరాజ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ గారా ఉషారాణి అన్నారు. రాజీవ్‌గాంధీభవన్‌లో బుధవారం భారత రత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఆధునిక భారతదేశాన్ని నిర్మించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ, గడ్డంపాల్ విజయ్ కుమార్, బిక్కా సునీల్, గాది నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, తిరుమలరావు, ఖాదర్‌వలి, కొండయ్య, శ్రీనివాసరావు తదితరులున్నారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉషారాణి తదితరులు

## వివాహిత అదృశ్యం


నోహిత

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ 2వ లైనుకి చెందిన నోహిత అనే వివాహిత అదృశ్యమైంది. నోహితకు 7 నెలల క్రితం గజవల్లి కోటేశ్వరరావు అనే అతనితో వివాహం జరిగింది. ఆమె బుధవారం మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయలు దేరి వెళ్ళింది. రాత్రి వరకు తిరిగి ఇంటికి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె భర్త గజవల్లి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మెటీరియల్ పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

## డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ

గుంటూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థులకు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెటీరియల్ పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా యూటీఎఫ్ హాల్లో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి.నాగయ్య పాల్గొన్నారు.

## కలిపురుషుని వృత్తాంతంపై ప్రవచనం


ప్రవచనం చేస్తున్న గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి

గుంటూరు(తూర్పు), మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధ వారం మహాభారతంలోని అరణ్యపర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచ కులు గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి ప్రవచిస్తూ మహాభారతం ప్రకారం కలి ఒక దుష్టదేవత అని పూర్వీకులైన కశ్యపముని పదిహేనో కుమారుడిగా జన్మించాడన్నారు. కలియుగ ప్రభువుగా కలి తన ప్రభావాన్ని పాపపు చర్యలను ప్రోత్సహించడానికి రాజు పరిక్షిత్తు మహారాజుని అడిగి పొందిన వర సహాయంతో జూదం, మద్యపానం, వ్యభి చారం, హత్య, బంగారం అనే ఐదు వ్యసనాలకు లోబడిన ప్రజలను ఆవహించి వారిని పతనం చేస్తాడన్నారు. ఆయన కథనంలో ఆయన చేత పీడించి, హింసించబడిన నల మహారాజు వంటి వ్యక్తులతో ముడిపడి ఉందన్నారు. మహాభారతంలో దుర్యోధనుడు ఆయన అవతారంగా పరిగణించబడ్డారన్నారు.

## వైభవంగా స్వామి వారి కల్యాణం

గుంటూరు(తూర్పు), మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత గుంటూ రు, శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి వేడు కలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి లక్ష్మీనారాయణ, ఆంజనేయ, సుదర్శన, సుందరకాండ హోమా లు నిర్వహించారు. రాత్రి స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహిం చారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పురావూరి బాబూ రావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు తదితరులు పర్యవేక్షించారు.


కల్యాణంలో పాల్గొన్న దంపతులు

## ముగిసిన శ్రీమహంకాళీ అమ్మవారి పునఃప్రతిష్ఠ ఉత్సవాలు

దుగ్గిరాల, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా లో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటిగా వెలుగొందుతున్న కేఆర్ కొండూరు శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం 48వ పునఃప్రతిష్ఠ ముగింపు ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. చివరి రోజు ఉత్సవాల్లో, అమ్మవారు శ్రీగాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయం నుంచి పలురకాలు పూలతో అలంకరించిన హంసవాహనంపై ఊరేగుతున్న అమ్మవారిని తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు బారులు తీరారు. చిలువూరు, కేఆర్ కొండూరు, మంచికలపూడి గ్రామాల్లో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, తారక్‌నాథ్‌శర్మ, మణిశర్మలు అమ్మవారికి హారతులిచ్చిన మహిళలకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈవో కోగంటి సునీల్, వ్యవస్థాపక ధర్మకర్త రంగప్రసాద్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


హంస వాహనంపై ఊరేగుతున్న శ్రీమహంకాళీ అమ్మవారు

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


ఆలయ ఉప కమిషనర్ లీలా కుమార్‌కు వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

పెదకాకాని, మే 21 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానానికి పెదకాకాని గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మీకాంతం, వుయ్యూరు మాసమ్మ జ్ఞాపకార్థం గరికపాటి రమేష్ కుమారుడు గరికపాటి వరుణ్‌దేవ్ బుధ వారం దేవస్థాన నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,116 నగదు, వెండి బిందె, వెండి గిన్నె విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా లీలాకుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళం సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.


పారిశుధ్యంపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్

## పారిశుధ్యం పై అశ్రద్ధ వహిస్తే సహించేది లేదు

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నిత్యం కృషి చేస్తున్నామని ఈ విషయంలో చిన్న పొరపాటు జరిగినా సహించబోమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అధికారులను హెచ్చరించారు. నియోజక వర్గంలోని యాదవ బజార్లో బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్థానిక ప్రజలతో మాట్లాడారు. తడి, పొడి చెత్త వేరు చేయడం, ఇళ్ల నుంచి చెత్త సేకరించడంపై ఆయన స్థానికుల వద్ద ఆరా తీశారు. పారిశు ధ్యంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలోని శానిటేషన్ సూపర్‌వైజర్, వార్డు శానిటేషన్ సెక్రటరీలను వెంటనే సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పనులు చేపడుతున్నారని, ఈ క్రమంలో అధికారులు అలసత్వం వహించి గొప్ప ఆశయానికి తూట్లు పొడిస్తే సహిం చబోమని ఎమ్మెల్యే తేల్చి చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యల్లావుల అశోక్, సాయి, బాజీ, కందుకూరి వెంకట్, కుర్రాకుల ప్రభాకర్, రియాజ్, కోట పిచ్చిరెడ్డి, మహంకాళి నరసింహారావు, జానీ, కనకారావు, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి టీజీ భరత్‌తో ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్

## ఏపీ పారిశ్రామిక రంగాన్ని అగ్రగామిగా చేస్తాం

● ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్

తాడేపల్లి (ప్రాతూరు), మే 21 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతామని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఐడీసీ) చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్‌ను బుధవారం చైర్మన్ దేగల ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి భరత్‌తో ఆయన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో పారిశ్రామికరంగం, ఏపీఐడీసీ పరిస్థితి గురించి మాట్లాడుకున్నారు. అనంతరం దేగల మీడియాతో మాట్లాడుతూ పోయిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పారిశ్రామిక రంగం కుదేలైపోయిందని, కార్పొరేషన్లు నీరుగారిపోయాయని అన్నారు. అప్పటి అధికార వైసీపీ నేతల దందాలు, దౌర్జన్యాలు, దోపిడీకి భయపడి అనేక కంపెనీలు రాష్ట్రం నుంచి పారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైపోయిన కార్పొరేషన్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు సహకరించాలని మంత్రిని కోరినట్లు చైర్మన్ దేగల ప్రభాకర్ చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌ని తయారు చేసే విధంగా, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ప్రతి జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఈ సందర్భంగా దేగల ప్రభాకర్ చెప్పారు.

## కూటమిపై వ్యతిరేకత జగన్ భ్రమే

● టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి

గుంటూరు(తూర్పు), మే 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే వ్యతిరేకత ఏర్పడిందని వైసీపీ నేతలు, జగన్‌మోహన్ రెడ్డి చెప్పడం వారి భ్రమకు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్ అన్నా రు. స్థానిక నగరంపాలెం, ఆయన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేక రుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు సాధ్యమవ్వడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వైసీపీ నాయకుల అరెస్టులపై జగన్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జగన్ పైశాచిక ఆనందానికి వైసీపీ నేతలు జైలుపాలవుతున్నారని అన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా, కూటమి నేతలు ఎదుర్కొనేందుకు క్షేత్ర స్థాయిలో సం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అఖం డ విజయం సాధించడం తథ్యమని స్పష్టం చేశారు.


దాడికి గురైన బ్రాహ్మణ పురోహిత కుటుంబసభ్యులను పరామర్శి స్తున్న బ్రాహ్మణ చైతన్య వేదిక నేత సిరిపురపు శ్రీధర్‌శర్మ

## శివారు ప్రాంతాల్లో హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేయాలి

● బ్రాహ్మణ చైతన్య వేదిక నేత సిరిపురపు శ్రీధర్‌శర్మ

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివారు ప్రాంతాల్లో పోలీసులకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్లు ప్రజలకు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక నేత సిరిపురపు శ్రీధర్ శర్మ కోరారు. బుధ వారం ఆయన నల్లపాడురోడ్డులోని సాయి నగర్‌లో రౌడీషీటర్ చేతిలో భౌతిక దాడికి గురైన బ్రాహ్మణ పురోహిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌శర్మ మా ట్లాడుతూ నగరంపాలెం పోలీస్‌స్టేషన్ అధికారుల విపరీత ధోరణిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఎస్పీ సతీష్‌కుమార్‌కు బ్రాహ్మణ బాధితులకు న్యాయం జరిగేలాగా చూడాలని ఫిర్యాదు చేశారన్నారు. దాంతో వారంతా స్పందించి నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో దాడి ఘటన పైన వివిధ సెక్షన్లతో ఎఫ్ఐఆర్ ద్వారా కేసు నమోదు చేయించారన్నా రు. వెంటనే స్పందించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## దాడి ఘటన పై కేసు.. నిందితుల అరెస్టు

సుబ్రమణ్యం పోలీసుస్టేషన్‌కి వచ్చి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయగా కేసు నమో దు చేసి దర్యాప్తు ప్రారంభించి, నిందితులు ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## నేడు విద్యుత్‌సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించటం వంటి పనుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అశోక్‌నగర్, పండరీపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.


బాపట్ల మండలం జిల్లెళ్ల మూడి గ్రామంలో మరమ్మతులకు నోచుకోని నల్లమడ డ్రెయిన్

# నల్లమడ.. గుండె దడ!

- వాగుకు వరదొస్తే.. పంటలు మునకే
- రూ.కోట్లలో నష్టం..గ్రామాలు జలదిగ్బంధం
- ఆధునికీకరణ పనులు హామీలకే పరిమితం
- భూసేకరణ, నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం

### నల్లమడ రైతు సంఘం ప్రధాన డిమాండ్లు

నిపుణుల కమిటీ సూచనలు పూర్తిగా అమలు చేయాలని నల్లమడ రైతు సంఘం డిమాండ్ చేస్తోంది. వాస్తవ వరద నీటిని లెక్కించి కనీసం 500 సివాల్యూవుకు వాగులను త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరుతోంది. ఇంకా... నిధులు మంజూరు చేసి శాశ్వత వరద నివారణ పనులు చేపట్టాలి. వాగులన్నిటిని అభివృద్ధి చేయాలి. వాగు వంపులను తొలిగించి.. పటిష్టమైన కట్టలు నిర్మించి మలుపులో రివిట్‌మెంట్ చేసి గండ్లు పడకుండా రక్షించాలి. పొలాల్లోని మురుగు పోయేవిధంగా ఇన్లెట్స్ నిర్మించాలి. డెల్టాలోని మీడియం, మైనర్ డ్రెయిన్‌లను అభివృద్ధి చేయాలి. కొమ్మమూరు కాల్వకు ఉన్న ఇన్లెట్‌లు, అవుట్‌లెట్‌ల వ్యవస్థను పునరుద్ధరించాలి. ఎగువ వరద నీటిని తూర్పునకు ప్రవహించేట్లు చేయాలి. నల్లమడ సముద్రంలో కలిసేచోట ఇసుక పూడిక తీయాలి. వాగులను పర్యవేక్షిస్తూ అవసరమైనప్పుడు వెంటనే జోక్యం చేసుకొని తగు చర్యలు చేపట్టాలి. నల్లమడ ఎగువన రిజర్వాయర్ నిర్మించాలి.

బాపట్ల, మే21 (ఆంధ్రజ్యోతి) : మూడు జిల్లాల పరిధిలోని లక్షల ఎకరాల ఆయుకట్టు రైతులకు మేలు చేసే నల్లమడ డ్రెయిన్ ఆధునీకీకరణ పనులకు గ్రహణం పట్టింది. ఇప్పటి వరకు నలుగురు ముఖ్యమంత్రులు ఈ ప్రాంతాన్ని సందర్శించి, నల్లమడ ప్రభావిత ప్రాంతాల ప్రజలు, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆధునీకరణకు పెద్దఎత్తున హామీలిచ్చారు. అవేవీ.. ఆచరణకు నోచుకోలేదు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలోని రైతులు పెద్ద ఎత్తున వినతులు అందజేస్తూనే ఉన్నారు. ప్రతిసారి వరదల సమయంలోనే అధికారులు, నాయకులు నల్లమడ సమస్యపై స్పందిస్తూనే ఉన్నారు. ఆ తర్వాత మిన్నకుండిపోతూనే ఉన్నారు. భూసేకరణ చేపట్టి వాగును విస్తరించి.. కట్టలు పటిష్టపరిచి.. ముంపు సమస్య లేకుండా చూస్తామని అనేకమంది నాయకులు హామీలిచ్చారు. నిధులు మంజూరు కోసం నా బార్డుకు ప్రతిపాదనలు కూడా పంపించారు. అయినప్పటికీ నల్లమడ సమస్య రైతులను పట్టి పీడిస్తూనే ఉంది.

### భూసేకరణ చేపట్టాలి

నల్లమడ డ్రెయిన్ ఆధునీకీకరణకు పెదనందిపాడు, కాకుమాను, బాపట్ల, కర్లపాలెం మండలాల్లో భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. దీనికి ప్రభుత్వ భూమి 113.58 ఎకరాలు ఉండగా.. 322.89 ఎకరాలు సేకరించాల్సి ఉంది. మొదటి దశలో భూ సేకరణకు కేటాయించిన నిధులు రూ.180కోట్లు కాగా.. రెండో దశలో వాగు విస్తరణ పనుల అంచనా వ్యయం రూ.310 కోట్లని ప్రతిపాదించారు. అయినప్పటికి నిధులు మంజూరు కాలేదు. దీనివల్ల నల్లమడ పరివాహక ప్రాంత రైతుల సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.


కోతకు గురైన నల్లమడ డ్రెయిన్ కట్ట

### సీ వాల్యూస్ 500కు పెంచాలి



నల్లమడ డ్రెయిన్ సీ వాల్యూస్ 300గా ఉంది. దీనిని 500కు పెంచాలి. పెదనందిపాడు నుంచి సూర్యలంక సముద్ర తీరం వరకు వంపులు తొలిగించి కట్టలు పటిష్ఠ పర్చాలి. నిపుణుల కమిటీ చెప్పిన విధంగా చేయాలి. వాగులను పర్యవేక్షిస్తూ అవసరమైనప్పుడు వెంటనే జోక్యం చేసుకొని ముంపు సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలి.

**-డాక్టర్ కొల్లా రాజమోహనరావు, అధ్యక్షుడు, నల్లమడ రైతు సంఘం**

### వరదొస్తే.. ముంపే..!

నల్లమడ వాగు నల్లమల అడవిలో ప్రారంభమై పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సుమారు 165 కిలోమీటర్లు దూరం ప్రయాణించి.. బాపట్ల మండలం సూర్యలంక తీరంలో పొగురు వద్ద సముద్రంలో కలుస్తుంది. ప్రతి రెండుమూడేళ్లకోసారి వాగుకు వరదలు వస్తుంటాయి. అప్పుడు మూడు జిల్లాల్లో వరి, వాణిజ్య పంటలు నీటమునిగి రైతులు రూ.కోట్లల్లో నష్టపోతున్నారు. 2013 అక్టోబరులో అతిపెద్ద వరద వచ్చింది. వాగు గరిష్ఠ వరద ప్రవాహ సామర్థ్యం 24వేల క్యూసెక్కులు కాగా.. 43 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. దీంతో బాపట్ల 40 శాతం ముంపునకు గురైంది. జిల్లెళ్లమూడి గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. లక్ష ఎకరాల్లో పంట దెబ్బతింది. జిల్లాలో 2023 డిసెంబరులో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో వాగు పొంగి కట్టలకు గండ్లు పడ్డాయి. వేల ఎకరాల పంటలు నీటమునిగాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. బాపట్ల, పర్చూరు నియోజకవర్గాల్లో పర్యటించిన నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే నల్లమడ వాగు ఆధునీకరిస్తామని ప్రకటించారు. దీనిపై నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు సభ్యులతో కలిసి చంద్రబాబు నాయుడుకు సమస్యను వివరించారు. వాగు ఆధునీకీకరణ ఆవశ్యకతను వివరించారు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.180 కోట్లు ఖర్చు చేశారని రెండోవ దశలో వాగు విస్తరణకు రూ.310 కోట్లు అవసరమని అంచనా రూపొందించి ప్రతిపాదనలు పంపారు. వైసీపీ పాలనలో పనులు నిలిపివేయడం వల్ల అంచనా వ్యయం పెరిగింది.


వరదల సమయంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లమడ డ్రెయిన్ (ఫైల్‌ఫొటో)




అభిషేక పూజల్లో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ వీరాంజనేయస్వామి

# శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

❖ వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు

పొన్నూరు టౌన్, మే21(ఆంధ్రజ్యోతి): పొన్నూరులో చరిత్ర ప్రసిద్ధి చెందిన వీరాంజనేయస్వామి దేవస్థానంలో జై..హనుమాన్ నినాదాలు నింగినంటాయి. హనుమజ్జయంతి ఉత్సవాలను దేవస్థానంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి దేవస్థాన క్యూ లైన్లు నిండిపోయాయి. బుధవారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు జరిపారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మూల మూర్తికి అభిషేకాలు అనంతరం అలంకరణ పూజలు శాస్త్రయుక్తంగా అర్చక స్వాములు జరిపారు. మధ్యాహ్నం స్వామివారికి ప్రీతికరమైన లక్ష తమలపాకులతో పూజా కార్యక్రమాలు, నివేదన, నీరాజనాలు భక్తిప్రపత్తులతో జరిపారు. సాయంత్రం స్వామి వారి ఉష్ట్ర వాహనంపై నగరోత్సవం కనుల పండుగగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు జై..ఆంజనేయ.. ప్రసన్నాంజనేయ అంటూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారికి భక్తులు వారపోసి టెంకాయలు సమర్పించి హారతులు పట్టారు. ఆలయ ఈఓ గద్దె వెంకట అమర్‌నాథ్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. విగ్రహ దాతలు కనిగల్పుల కోటయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వెలవెలబోతున్న.. సున్నం పరిశ్రమ..!


పిడుగురాళ్లలోని సున్నంబట్టీ

- ఎగుమతులు లేక మూతపడుతున్న బట్టీలు
- లబోదిబో మంటున్న వ్యాపారులు
- ప్లాట్లుగా మారుతున్న బట్టీ ప్రాంతాలు

పిడుగురాళ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే పిడుగురాళ్ల లైమ్‌సిటీగా పేరుపొందింది. అలాంటి సున్నం పరిశ్రమ ప్రతిష్ఠ నేడు మసకబారుతోంది. ఇక్కడి నుండి అన్ని ప్రాంతాలకు సున్నం ఎగుమతులతో ఎప్పుడూ రద్దీగా వుండే సున్నంబట్టీలు నేడు వెలవెలబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ కాక తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు పిడుగురాళ్ల నుండే సున్నం ఉత్పత్తులు రవాణా జరిగేవి. పిడుగురాళ్ల ప్రాంతంలో ఒకప్పుడు 230 సున్నం బట్టీలు ఉండగా గత ప్రభుత్వాల హయాంలో రాయితీ తగ్గించడం, ఖర్చులు పెరగడంతో క్రమేపి బట్టీలు మూతపడ్డాయి. గత ఐదేళ్లలో సుమారు 80 బట్టీలు నిరాటంకంగా తమ ఉత్పత్తులను రాష్ట్రాల వ్యాప్తంగా ఎగుమతులు సాగించిన సున్నం వ్యాపారుల పరిస్థితి నేడు చతికిలపడ్డట్టు అయింది. ప్రస్తుతం సుమారు 35 బట్టీలే సున్నం ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి.

### గృహనిర్మాణ అనుమతులు లేకపోవడం.....

సున్నంబట్టీల ద్వారా రెండు రకాల ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తాయి. చెక్కరాయితో వచ్చిన సున్నం ఉత్పత్తి హాలో బ్రిక్స్ తయారీకి, చేపల చెరువుల వాడకానికి విరివిగా ఉపయోగిస్తారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇసుక కొరత ఏర్పడటంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో చెక్కరాయితో తయారైన సున్నం ఉత్పత్తికి రాష్ట్ర వ్యాప్తంగా గిరాకీ పడిపోయి ఆ ప్రభావం నేటికీ కనిపిస్తున్నది. తెల్లరాయితో ఉత్పత్తి అయ్యే సున్నం కొన్ని రాష్ట్రాలకు ప్రస్తుతానికి ఎగుమతుల పర్వం కొన్నాళ్లుగా తగ్గుముఖం పట్టింది. దీనికి కారణం బొగ్గురేటు, సున్నంరేటు పెరగడంతో కొనుగోలు అంత ధర చెల్లించక పోవడంతో పాటు షుగర్ ఫ్యాక్టరీల నుండి అంతకు ముందున్న మాదిరిగా భారీగా ఆర్డర్లు దక్కకపోవడమే కారణంగా చెప్పవచ్చు.

### రాజస్థాన్ నుంచి కొనుగోలు

ఇప్పటి దాకా పిడుగురాళ్ల నుండి పలు రాష్ట్రాలకు సున్నం ఉత్పత్తులు రవాణా అయ్యేవి. గత కొన్నేళ్లుగా రాజస్థాన్‌లో పెట్టిన సున్నంబట్టీల నుండి తయారయ్యే సున్నం ఉత్పత్తులు మరికొన్ని రాష్ట్రాలకు సరఫరా అవుతుంది. పిడుగురాళ్లలో తయారయ్యే సున్నం ఉత్పత్తుల్లో క్వాలిటీ, ప్యూర్ వైట్ కన్నా అక్కడ తయారయ్యే సున్నం ఉత్పత్తుల్లో 90 శాతం క్వాలిటీ, ప్యూర్ వైట్ లభిస్తుండటంతో కొన్ని రాష్ట్రాల వ్యాపారులు రాజస్థాన్ నుండి సున్నం ఉత్పతుల కొనుగోలుకు మొగ్గు చూపుతుండటంతో పిడుగురాళ్ల నుండి కొన్ని రాష్ట్రాలకు చాలా కాలంగా జరుగుతున్న సున్నం ఎగుమతులలో స్తబ్ధత ఏర్పడటంతో వ్యాపారులు అయోమయా నికి గురవుతున్నారు. దీంతో సున్నం వ్యాపారం ఒడిదుడుకుల తో వ్యాపారులు, సున్నం పరిశ్రమకు గడ్డు కాలం ఏర్పడే అవకాశం వుంది.

### కూలీల కొరత కూడా కారణం

ఒకప్పుడు సున్నం మిల్లులు, బట్టీలలో పనిచేసేందుకు పొరుగు జిల్లాలైన నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు పిడుగురాళ్ల సమీప మండలాలకు చెందిన వేలాది మంది కుటుంబాలతో సహా ఉపాధి దొరికేది. తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేస్తే సరాసరి సగటున వెయ్యి రూపాయలు చేతికొచ్చేవి. ప్రకాశం జిల్లా నుండి ఒకానొక సమయంలో లెక్కకు మించి వచ్చే కార్మికుల వలస ఇప్పుడు తగ్గిపోయింది. అయా ప్రాంతాలలో వ్యవసాయ ఆధారిత పంటలు, బోర్లు, విద్యుత్ సౌకర్యాలతో పంటలు సాగు చేసుకునే సదుపాయం వుండటంతో ఇక్కడికి వచ్చి సున్నం బట్టీలు, మిల్లుల్లో పనిచేసే వారి సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది.

### బట్టీల స్థానంలో ప్లాట్లు

దశాబ్దాల కాలం పాటు లైమ్‌సిటీలో పేరొందిన సున్నం బట్టీల ప్రాంతం ఒకప్పుడు కళకళలాడేది. కొన్ని వందల మందికి బతుకుదెరువును చూపిన సున్నం బట్టీలు కాలం కలిసిరాక, ప్రభుత్వాల నుండి రాయితీలు అందక ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. కొందరు మాత్రమే మరో వ్యాపకం లేక సున్నం బట్టీని కాల్చి వ్యాపారం చేస్తుండగా మరికొందరు మాత్రం ఇంకెందుకు అంటూ బట్టీలను తొలగించి ఆ ప్రదేశాన్ని ప్లాట్లుగా వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.


రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మారిన సున్నం బట్టీ ప్రాంతం

## అకాల వర్షం.. పొంగి పొర్లిన వాగులు

బొల్లాపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంట్లపల్లి, కంద్రిక, గుంగుపల్లి గ్రామాల్లో బుధవారం కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. గత పది రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. గుంట్లపల్లి - కంద్రిక మధ్యలో వాగు పొంగి ప్రవహించడంతో ఆ రహదారిలో రాకపోకలు స్తంభించాయి. అదే విధంగా గుంట్లపల్లి వద్ద వాగు కూడా భారీ ప్రవహించడంతో గుట్లపల్లి నుంచి పుల్లల చెరువు వెళ్లే వాహనాలు నిలిచి పోయాయి. వాగు ఉధృతి తగ్గాక యథావిధిగా వాహనాలు నడిచాయి.


గంగుపల్లి - కంద్రిక మధ్యలో పొంగి ప్రవహిస్తున్న వాగు


గుట్లపల్లి వద్ద భారీగా ప్రవహిస్తున్న వాగు

# రైల్వేలో ఉగ్రవాద వ్యతిరేక దినం

● దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డీఆర్ఎం సుధేష్ణసేన్

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో బుధవారం ఉగ్రవాద వ్యతిరేక దినం పాటించారు. గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లు, కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ గుంటూరు - మాచర్ల, న్యూ పిడుగురాళ్ల - శావల్యాపురం సెక్షన్లలో తనిఖీలు నిర్వహించి ఉద్యోగులతో హింసకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులు తోటి వారితో శాంతియుతంగా ఉండాలన్నారు. సామాజిక సామరస్యం పాటించాలని సూచించారు. ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్ తదితరులు పాల్గొన్నారు.

### త్వరలో ఆర్‌యూబీ నిర్మాణ పనులు

శావల్యాపురం, మే21(ఆంధ్రజ్యోతి): గుంటూరు నుండి గుంతకల్ రైల్వే మార్గంలో శావల్యాపురం నుండి కారుమంచికి వెళ్లే దారిలో ఉన్న 268 రైల్వే గేటు వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్‌యూబీ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా నడికూడి నుండి మాచర్ల వరకు రైల్వే స్టేషన్‌లను ఆమె బుధవారం సందర్శించారు. శావల్యాపురం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ప్లాట్ ఫాం పనుల పురోగతిని పరిశీలించారు. ఇక్కడ కరోనా సమయంలో నిలిపివేసిన రైళ్ల స్టాపింగ్‌లను పునరుద్ధరించాలని, నడికుడి, మార్కాపురం మధ్య ప్రత్యేక రైలును ఏర్పాటు చేయాలని స్థానికులు ఆమెను కోరారు. ప్రజాప్రతినిధుల ద్వారా లిఖితపూర్వక వినతిపత్రం అందజేస్తే రైల్వే ఉన్నతాధికారులకు పంపించి పరిష్కరిస్తామని డీఆర్ఎం సమాధానం ఇచ్చారు. అనంతరం స్టేషన్ మాస్టర్ మధుబాబుతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సుబ్బారావు, రత్నాకర్, శ్రీనాథ్, ప్రదీప్ పాల్గొన్నారు.


ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

## దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 1195 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,400, మోడల్‌ధర రూ.10,060 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,400 మోడల్‌ధర రూ.10,060 పలికాయి.

## నేడు హనుమత్ జయంతోత్సవాలు

వట్టిచెరుకూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా గ్రామాల్లో గురువారం హనుమత్ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించుకొనేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా మండలంపరిధిలోని సౌపాడు, పుల్లడిగుంట, ముట్లూరు, లేమల్లెపాడు, వట్టిచెరుకూరు, అనంతవరప్పాడు గ్రామాల్లోని ఆలయాల్లో హనుమత్ జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు పూర్తి చేసి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## సీపీఐ నేతకు రామకృష్ణ పరామర్శ

తాడేపల్లి(పెనుమాక), మే 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీపీఐ సీనియర్ నాయకులు గుంటక సాంబిరెడ్డిని బుధవారం సాయంత్రం పెనుమాకలోని వారి నివాసంలో పరామర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, మంగళగిరి నేతలు, చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు పరామర్శించారు.

## వర్షంతో రాజధాని నిర్మాణ పనులకు బ్రేక్

తుళ్లూరు, మే 21(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలు కారణంగా రాజధాని నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. వివిధ కంపెనీలు టెండర్లు దక్కించుకొని పనులు మొదలు పెట్టడానికి కార్మికులను వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పించారు. వారికి వసతులు కల్పించారు. ఈ లోపు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి వర్షాలు పడుతున్నాయి. మొదట విడతతో రాజధాని నిర్మాణ పనులకు సీఆర్డీఏ రూ.43 వేల కోట్లు టెండర్లు కేటాయించింది. పనులు ప్రారంభమవుతున్న తరుణంలో వర్షాలు పడుతుండటంతో పనులు ముందుకు సాగట్లేదు.

## ఘర్షణపై కేసు నమోదు

పెదనందిపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పుసులూరులో ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం బండారు శాంత కుమారి ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా మననం నాగేశ్వరరావుతో పాటు మరో నలుగురు శాంతకుమారిని కొట్టారని ఫిర్యాదులో తెలిపింది. రాజ్యలక్ష్మి తన అత్త నర్సమ్మపై బండారు శాంతకుమారితో పాటు మరో వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఘర్షణకు దిగి కొట్టి గాయపరిచారంటూ ఫిర్యాదులో తెలిపారు. ఇరువురి ఫిర్యాదులపై ఎస్ఐ మధుపవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 169వ రోజుకు చేరుకున్న దీక్షలు

తాడేపల్లి టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, చట్టప్రకారం రావాల్సిన బకాయిలు కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారంతో 169వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నేత కూరపాటి స్టీవెన్, దుర్గారావు ప్రారంభించారు.

## ఏపీ పారిశ్రామిక రంగాన్ని అగ్రగామిగా చేస్తాం

● ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

తాడేపల్లి (ప్రాతూరు), మే 21 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతామని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్‌ను బుధవారం చైర్మన్ డేగల ప్రభాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి భరత్‌తో ఆయన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో పారిశ్రామికరంగం, ఏపీఐడీసీ పరి స్థితి గురించి మాట్లాడుకున్నారు. అనంతరం డేగల మీడియాతో మాట్లాడుతూ పోయిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పారిశ్రామిక రంగం కుదేలైపోయిందని, కార్పొరేషన్లు నీరుగారిపోయాయని అన్నారు. అప్పటి అధికార వైసీపీ నేతల దందాలు, దౌర్జన్యాలు, దోపిడీకి భయపడి అనేక కంపెనీలు రాష్ట్రం నుంచి పారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైపోయిన కార్పొరేషన్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు సహక రించాలని మంత్రిని కోరినట్లు చైర్మన్ డేగల ప్రభాకర్ ఈ సందర్భంగా చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌ని తయారు చేసే విధంగా, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ప్రతి జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు డేగల ప్రభాకర్ చెప్పారు.



మంత్రి టీజీ భరత్‌తో ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

## మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

తాడేపల్లి టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం అమరారెడ్డి నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త కొంకి మోహనరావు జనవరి 17న రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయనకు టీడీపీ సభ్యత్వం ఉంది. దీంతో ఆ కుటుంబానికి మంజూరైన ఇన్సూరెన్స్ సొమ్ము రూ.5లక్షల చెక్కును మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో పార్టీ నేతలు మృతుని ఇంటి వద్దకు వెళ్లి బుధవా రం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబసభ్యులు మాట్లాడు తూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లభనేని వెంకట్రావు, దారా దాసు, మండవ గోపాలరావు, అద్దంకి మురళి, తదితరులు పాల్గొన్నారు.



నగదు చెక్కు అందజేస్తున్న టీడీపీ నేతలు

## మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

● డీఎస్పీ భానోదయ

వట్టిచెరుకూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్లూరులో బుధవారం రాత్రి డీఎస్పీ భానోదయ స్థానిక ఎస్సీ కాలనీలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ భానోదయ తొలుత గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలతో మమేకమై గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై పోలీసుల ప్రవర్తన తదితర విషయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గ్రామసీమలు ప్రశాంతతకు నిలయంగా చెప్పుకుంటారని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలు అంధ కారమవుతాయని తెలిపారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదురైనా తక్షణమే స్పందించి పోలీసులకు సమాచారమివ్వాలని, వారు స్పందించకపోతే తనకు నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సీఐ రమానాయక్, ఎస్ఐ బాబూరావు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.



పల్లె నిద్రలో భాగంగా గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ

## సాంకేతిక విప్లవానికి నాంది పలికిన రాజీవ్‌గాంధీ

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీమ్

మంగళగిరి సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలిసారిగా సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీమ్ అన్నారు. భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళగిరి బస్టాండు సెంటరులోని రాజీవ్ గాంధీ విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళి అర్పించారు.

## రోడ్డుపై నిర్మించిన షెడ్డు తొలగించాలి

మంగళగిరి, మే 21 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం శ్రీనగర్‌కాలనీ 60 లింకుల రోడ్డు మూడో లైను నుంచి వచ్చే మార్గాన్ని ఆక్రమించి నిర్మించిన షెడ్డును తొలగించాలని కోరుతూ ఆ ప్రాంతవాసులు బుధవారం ఎంటీఎంసీ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

## ముగిసిన శ్రీమహంకాళీ అమ్మవారి పునఃప్రతిష్ఠ ఉత్సవాలు

● హంస వాహనంపై మూడు గ్రామాల్లో కోలాహలంగా గ్రామోత్సవం

దుగ్గిరాల, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటిగా వెలుగొందుతున్న కేఆర్ కొండూరు శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం 48వ పునఃప్రతిష్ఠ ముగింపు ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. చివరి రోజు ఉత్సవాల్లో, అమ్మవారు శ్రీగాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయం నుంచి పలురకాలు పూలతో అలంకరించిన హంసవాహనంపై ఊరేగుతున్న అమ్మవారిని తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు బారులు తీరారు. చిలువూరు, కేఆర్ కొండూరు, మంచికలపూడి గ్రామాల్లో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, తారక్‌నాధ్‌శర్మ, మణిశర్మలు హంస వాహనంపై వస్తున్న అమ్మవారికి హారతులిచ్చిన మహిళలకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈవో కోగంటి సునీల్, వ్యవస్థాపక ధర్మకర్త రంగప్రసాద్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



హంస వాహనంపై ఊరేగుతున్న శ్రీమహంకాళీ అమ్మవారు

## జెండా దిమ్మె ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి

వట్టిచెరుకూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టిచెరుకూరు గ్రామంలో జనసేన పార్టీ జెండా దిమ్మెని ధ్వంసం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు కోరారు. బుధవారం వేకువ జామునకు ముందు జనసేన జెండా దిమ్మెని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని పార్టీ స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొన్న కొర్ర పాటి, ఇతర నాయకులు బుధవారం సాయం త్రం పల్లపాడులో ఘటన జరిగిన ప్రదేశాన్ని సందర్శించారు. ఈ విషయాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి స్థానిక సీఐ, జిల్లా ఎస్పీతో మాట్లాడారని కొర్రపాటి చెప్పారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన వారిలో జనసేన నాయకులు ఎస్ త్రినాధ్, భావన్నారాయణ, కావేటి శ్రీనివాసరావు, కాటూరి శ్రీనివాసరావు, రామయ్య, వెంకటేష్, గంగిశెట్టి వెంకటేశ్వరరావు, జాన్‌బాబు, ఎనుమల రాంబాబు, నాగినేని సునీల్‌కుమార్, పసుపులేటి శ్రీనివాసరావు, సాంబశివరావు, శివపార్వతి తదుతరులున్నారు.



పార్టీ దిమ్మెని ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కొర్రపాటి, నాయకులు

## కొండలరావుకు బీజేపీ నేతల అభినందన

మంగళగిరి, మే 21 (ఆంధ్రజ్యోతి): జై కాపుసేన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన తిరుమలశెట్టి కొండలరావును బీజేపీ నేతలు బుధవారం కలిసి అభినందనలు తెలియజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, నేతలు అందె శంకరరావు, వైపీ సుబ్బారావు, ఏసుబాబు, తుమ్మా శ్యామ్, యశోదకృష్ణ, మునగ పాటి వెంకటేశ్వరరావు, తుల్లిమిల్లి రామకృష్ణ, పిల్లి నాగేశ్వరరావు తదితరులు కొండలరావు కు శుభాకాంక్షలు తెలియజేసి భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు.



తిరుమలశెట్టి కొండలరావును అభినందించిన బీజేపీ నాయకులు

## మహిళల ఆర్థికాభివృద్ధికి శిక్షణ దోహదం

● డాక్టర్ కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని డాక్టర్ కొల్లా రాజమోహనరావు అన్నారు. స్థానిక కామ్రేడ్ కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో బుధవారం మహిళలకు ఆర్థిక స్వావలంబనలో భాగంగా సర్ఫ్, సోప్ ఆయిల్, ఫినాయిల్, పెయిన్‌బామ్‌ల తయారీపై ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఉపా ధ్యాయిని మక్కెన జవహర్‌రాణి తయారీ విధానం గురించి మహిళలకు తెలియజేశారు. తక్కువ ఖర్చుతో వస్తువులు తయారీ చేసి అధిక లాభాలు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లా వెంకయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షం.. పొంగిన డ్రెయిన్‌లు



ఫిరంగిపురం చర్చి వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఫిరంగిపురం, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 7 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా రాత్రి వరకు వర్షం పడుతూనే ఉంది. మధ్యాహ్నానికే 53.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గ్రామంలో ఆంధ్రా బ్యాంక్, సొలస బస్టాండ్ రోడ్డు, అల్లంవారిపాలెం, వినాయకుని గుడి పక్కన ఉన్న డ్రెయిన్‌లు పొంగి పొర్లాయి. దుకాణాల్లో కూడా నీరు చేరింది. గ్రామంలోని రహదారులన్నీ కాలువలయ్యాయి.

### బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు-1 బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **యంపరాల శ్రీనివాసరావు** గారి కుమారుడు **యంపరాల నాగరాజు** గారి ఆస్తిని తనఖా పెట్టుకొని **యంపరాల నాగరాజు** గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు **యంపరాల నాగరాజు** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : బాపట్ల జిల్లా, బాపట్ల ఆర్.ఒ., బాపట్ల మండలం, గుడిపూడి గ్రామ పంచాయితీలోని గుడిపూడి గ్రామం తాలూకు డి.నెం. 256/1రు య. 2-26 సెంట్లు మింజుమలె నాకు హక్కు కలిగిన నీకు దఖలు పరచిన చ.గ. 218లు ఖాళీ స్థలమునకు హద్దులు **తూర్పు** : పంచాయితీ రోడ్డు హద్దు - లిం. 33 1/2లు, **దక్షిణం** : యంపరాల శ్రీను గారి ఇల్లు స్థలము హద్దు - లిం. 134లు, **పడమర** : యంపరాల గంగయ్య గారి స్థలము హద్దు - లిం. 33 1/2లు, **ఉత్తరం** : యంపరాల గంగయ్య వగైరాల స్థలము హద్దు - లిం. 134లు, ఈ నాలుగు హద్దుల మధ్య గల చ.గ. 218లు లేక చ.మీ. 180ర్లు ఖాళీ స్థలమున్నూ. DOC NO : 9352/2023, S.R.O. బాపట్ల.

**లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,**
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

### బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు-2 బ్రాంచి వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **పగడాల అంజనేయులు గారి భార్య శివపార్వతి గారి** ఆస్తి తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు **పగడాల సుజాత** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : గుంటూరు డి., తెనాలి రి.డి., యిలాకా కఠెవరం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన కఠెవరం గ్రామ డి.నెం. 214-ఎ1 రు య. 4-40 సెంట్లు మింజుమలె ప్లాను దాఖలా ప్లాటు నెం. 68 రునకు హద్దులు : **తూర్పు** : ప్లాను దాఖలా ప్లాటు నెం. 69రు హద్దు అ.50-00, **దక్షిణం** : అ20-00లు వెడల్పు గల రోడ్డు హద్దు అ.27-00లు. **పడమర** : ప్లాను దాఖలా ప్లాటు నెం.67రు హద్దు. అ.50-00లు, **ఉత్తరం** : ప్లాను దాఖలా ప్లాటు నెం. 54రు హద్దు అ.27-00లు. ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ.150-00 లకు సరియగు చ.మీ.125-41 ర్లు ఖాళీ నివేశన స్థలము. దస్తావేజు నెం. 9282/2011 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు : తెనాలి

**లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,**
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



## బ్యాటరీల చోరీపై విచారణ

పొన్నూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజ్ ల్యాబ్‌లో బ్యాటరీలు చోరీపై పొన్నూరు రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు. పొన్నూరు రూరల్ గ్రామం చింతలపూడిలోని ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ప్రవేశించారు. ల్యాబ్‌లో ఏర్పాటుచేసిన సుమారు 20 బ్యాటరీలను అపహరించుకుపోయారు. దీనిపై కాలేజ్ యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. సిబ్బందితో గాలింపు చేపట్టి చోరీకి గురైన బ్యాటరీలు, నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

## వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి: మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, మే 21 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు వైద్యుల సలహా మేరకు మందులను వాడుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న మెడికల్ క్యాంపులను పేద ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌వీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సరళ, ఏఎన్‌ఎం యామిని, హెల్త్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు శాంతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ఉప కమిషనర్ లీలా కుమార్‌కు వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

పెదకాకాని, మే 21 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానానికి పెదకాకాని గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మీకాంతం, వుయ్యూరు మాసమ్మ జ్ఞాపకార్థం గరికపాటి రమేష్ కుమారుడు గరికపాటి వరుణ్‌దేవ్ బుధవారం దేవస్థాన నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,116 నగదు, వెండి బిందె, వెండి గిన్నె విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా లీలాకుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళం సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట,మే 21(ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రంలోని వృద్ధులకు శ్రీవేంకటేశ్వర యోగ సేవ క్షేత్రం సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం స్థానిక నాజరుపేటలోని మనఇల్లు వృద్ధాశ్రంలో ఎస్‌వీ యోగా సభ్యులు పొలిశెట్టి ఫణీంద్ర, స్వప్నిక దంపతుల కుమారుడు ఆమాన్షు పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాబక్తుని రమణయ్య, సభ్యులు చందు త్రివేణి, పొలిశెట్టి నాగమల్లేశ్వరి, గనిపిశెట్టి సావత్రి, చందు ప్రశాంత, ఆశ్రమ నిర్వాహకులు మురళీ, భారతి పాల్గొన్నారు.

# సమస్యల రహితంగా తెనాలిని తీర్చిదిద్దుకుందాం

● సబ్ కలెక్టర్ సంజనసింహా


సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సంజనాసింహా, పక్కన అధికారులు

తెనాలి మారీసుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివిధ వార్డుల్లో నెలకొని ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తక్షణ పరిష్కారదిశగా ముందుకు వెళితే సమస్యల రహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దుకోవచ్చని సబ్‌కలెక్టర్ సంజనాసింహా అన్నారు. బుధవారం స్థానిక కొత్తపేటలోని శ్రీ రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పట్టణంలోని 40వార్డుల సచివాలయ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజనా సింహా మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డుల్లో మంత్రి మనోహర్ పర్యటించిన సమయంలో ఆయా వార్డుల ప్రజలు శానిటేషన్ పనులపై అధికంగా ఫిర్యాదులు చేశారన్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటే అనారోగ్య సమస్యల బారిన ప్రజలు పడే అవకాశం ఉందన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఇంటింటి సర్వేతో అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి తక్షణవైద్యం అందేలా చూడాలన్నారు. రేషన్ కార్డులలో చేర్పులు, మార్పులు, నూతన కార్డుల ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందేలా చూడాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు తగిన గౌరవం ఇస్తూ సమస్యలను సావధానంగా ఆలకించి తక్షణ పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతినెలా రివ్యూ మీటింగ్ ద్వారా వార్డుల్లో పరిష్కారమైన సమస్యల వివరాలు ఉద్యోగులు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. విధుల్లో అలసత్వంగా వ్యవహరిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశానికి హాజరుకాని పలువురు ఉద్యోగులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, పలు శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హనుమజ్జయంత్యుత్సవ శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

తెనాలి అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని షరాఫ్ బజారులో బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలు లక్ష హనుమాన్ చాలీసా పారాయణం గురువారం ప్రారంభం కానున్నాయి. దీనిని పురస్కరించుకుని భక్తులు పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. అలంకరించిన రథంపై స్వామివారిని ఉంచి పట్టణంలో ఊరేగించారు. సంకీర్తన బృందం, విఖనస ట్రస్ట్ సభ్యులు, ఆంజనేయస్వామి పతకాలతో రామనామ స్మరణ చేస్తూ యాత్రలో పాల్గొన్నారు. ఈవో శ్రీనివాస రెడ్డి, అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సురేష్, సంకీర్తన బృందం సభ్యులు అనురాధ, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### వీరాంజనేయస్వామికి చూత ఫలార్చన

తెనాలి అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మారీసుపేటలోని శివాలయంలో వీరాంజనేయస్వామికి బుధవారం చూత ఫలార్చన (మామిడి పండ్లు) పూజ చేశారు. హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా ఆలయ ఆవరణలో దక్షిణముఖంలో ఉన్న వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు లక్ష హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. గురువారం సహస్ర నారికేళ అర్చన, హారతి, సువర్చల హనుమత్ కల్యాణం జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

### భక్తి శ్రద్ధలతో శ్రీదాసాంజనేయ స్వామికి పూజలు

తెనాలి, మారీసుపేట,మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలోని శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీదాసాంజనేయ స్వామివారి 16వ వార్షిక మహోత్సవాలను రెండో రోజు వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం శ్రీవిద్యాపీఠంలోని పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) వారి పర్యవేక్షణలో శ్రీ దాసాంజనేయ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలను, సింధూరంతో అర్చనలను నిర్వహించి 1108 అరటి పండ్లతో అలకరించి నివేదించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి రావురి సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం, రాజేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.


మామిడి, అరటి పండ్ల ప్రత్యేక అలంకరణలో స్వామివారు

### కొలకలూరులో...

తెనాలి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు కోనేటిపురంలో కొలువుదీరి ఉన్న శ్రీఅభయ వీరాంజనేయస్వామి వారి దేవస్థానంలో హనుమత్ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండో రోజు స్వామివారికి 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం భక్తి ప్రపత్తులతో జరిపారు. సాయంత్రం భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ ధూళిపూడి పూర్ణచంద్రరావు, దేవస్థాన కమిటీ సభ్యులు పర్యవేక్షణలో జరుగుతున్న పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

### వీరాంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

పొన్నూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నండూరులోని వీరాంజనేయ స్వామివారి జయంతి కల్యాణ వార్షిక బ్రహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. శ్రీపంచముఖ హనుమత్ పీఠ ప్రాంగణంలో శ్రీవీరాంజనేయస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు స్వామి వారికి సింధూరం, అప్పాలతో అర్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీలలితా సహస్రనామ పారాయణం, విష్ణు సహస్ర నామపారాయణం, ప్రదోషకాల సహస్ర నామార్చనలు, పంచహారతులు, వేదస్వస్తి వంటి పూజలు జరిపారు. శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పని చేసి పదవికి వన్నె తెస్తా

● మహిళ కమిషన్ చైర్ పర్సన్ శైలజ


శైలజను సన్మానిస్తున్న రాజకుమారి, మహిళలు

తెనాలి అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల సంక్షేమమే లక్ష్యంగా, బాధ్యతతో పనిచేసి పదవికి వన్నె తెస్తానని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ చెప్పారు. పట్టణంలోని ఐతానగర్‌లో నివసిస్తున్న మహిళ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి గృహానికి బుధవారం విచ్చేసి ఆమెతో ముచ్చటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా పని చేస్తామన్నారు. సీనియర్ నాయకురాలు రాజకుమారి నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు వచ్చానన్నారు. రాజకుమారి మాట్లాడుతూ, రాజధాని కోసం జరిగిన పోరాటంలో శైలజ ఎంతగానో పనిచేశారని, అవమానాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకువెళ్లారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసి పదవికి వన్నె తేవాలన్నారు. శైలజను జ్ఞాపిక, శాలువాతో ఐతానగర్ మహిళలు ఘనంగా సన్మానించారు.

## శానిటేషన్ పనుల పరిశీలన

తెనాలి, మారీసుపేట,మే 21 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో పలు వార్డుల్లో జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. బుధవారం స్థానిక ముత్తెశెట్టిపాలెం 15వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో పట్టణంలో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం 16వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి శానిటేషన్ సిబ్బంది పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరావు, దివి అనిత, టీపీవో సాంబశివరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### డ్రెయిన్లను పరిశీలించిన కమిషనర్ శేషన్న

పురపాలక సంఘ పరిధిలోని పలు డ్రెయిన్లతో జరుగుతున్న సిల్ట్ తొలగింపు పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని తొలగించిన వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించి పలు సూచనలు చేశారు. కమిషనర్‌తో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


నివాసితుల వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

## నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరిస్తాం

● తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఏన్నో ఏళ్ల నుంచి స్థలాలను ఆక్రమించుకుని నివాసముంటున్న వారికి నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరిస్తామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. ఇటీవల మంత్రి మనోహర్ పట్టణంలోని పాండురంగపేట, సుగాలికాలనీ వంటి ప్రాంతాల్లో పర్యటించిన నేపథ్యంలో అక్కడి ప్రజలు తాము ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్నామని తమకు స్థలాలను క్రమబద్ధీకరించేలా చూడాలని కోరారు. దీనిపై మంత్రి మనోహర్ ఆదేశాలతో మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బుధవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. నివాసితులతో మాట్లాడి వారి వద్ద ఉన్న వివరాలను సేకరించారు. 150 గజాలలోపు ఉన్న స్థలాలను క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. మంత్రి మనోహర్ ఇచ్చిన మాట ప్రకారం సర్వే చేపట్టడం జరుగతుందని త్వరలోనే అభ్యంతరాలను పరిశీలించి స్థలాలను క్రమబద్ధీకరించడం జరుగుతుందని తహసీల్దార్ స్పష్టం చేశారు. పలువురు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ అందుకున్న లబ్ధిదారులతో మంత్రి మనోహర్

## పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం భరోసా

● మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఉన్న పేదలకు ఖరీదైన వైద్యం అందిపుచ్చుకునేలా కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చులు అందిస్తూ వారికి భరోసాగా నిలుస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 14మంది లబ్ధిదారులకు రూ.14,45,642 చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడే పేదలకు సీఎం ఆర్‌ఎఫ్ ఫండ్ వరంలా ఆదుకుంటుందన్నారు. తెనాలి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 11నెలల్లో 134మందికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1కోటి 78లక్షలు అందించినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. నియోజకవర్గంలో ఎవరైనా వైద్యఖర్చులతో బాధపడుతుంటే తమను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మురుగునీరు తొలగింపు

ఎఫెక్ట్


తూములూరు ప్రాథమిక పాఠశాలలో నిల్వఉన్న నీటిని బయటకు పంపుతున్న పంచాయతీ కార్మికుడు

కొల్లిపర, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూములూరులో పారిశుధ్యం అధ్వానం.. అంటూ ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురించితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సీ, బీసీ కాలనీల్లో గృహాల చుట్టూ, తాగునీటి పంపు వద్ద, రామాలయం వద్ద, సిమెంట్‌రోడ్లపై నిల్వ ఉన్న మురుగు నీటిని అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్మికులు తొలగించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ భార్గవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డును ఆక్రమించుకోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలు కూడా సహకరించితే గ్రామంలో మురుగునీరు స్తంభించదన్నారు.

## కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట,మే 21 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించారంటూ అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక గంగానమ్మపేటకు చెందిన చిరువ్యాపారి రమాదేవి, చుండూరు మండలం దుండిపాలెంకు చెందిన కూరపాటి బాలస్వామికి గతంలో ఓ విషయంలో మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. బాలస్వామి ఈ నెల 18న వ్యక్తిగత పనుల మీద తెనాలి వచ్చాడు. ఈ క్రమంలో రమాదేవికి బాలస్వామికి వివాదం చోటుచేసుకుంది. దీంతో రమాదేవి కులం పేరుతో బాలస్వామిని దూషిస్తు దాడికి పాల్పడిందని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరించాలి ● తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కర వేదికలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వారి దరఖాస్తును పరిశీలించాలన్నారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డుల కోసం పెట్టుకున్న ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పొజిషన్ సర్టిఫికెట్‌ల జారీ వేగవంతం చేయండి

● గృహనిర్మాణ అధికారులతో తహసీల్దార్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మహ్మద్ జియావుల్‌హక్

పొన్నూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణాలకు అవసరమైన అర్హులకు పొజిషన్ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ మహ్మద్ జియావుల్‌హక్ చెప్పారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గృహనిర్మాణశాఖ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మహ్మద్ జియావుల్‌హక్ ప్రత్యేక సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 380మంది ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు పొజిషన్ సర్టిఫికెట్లు అందించాల్సి ఉందన్నారు. ఇప్పటికి 147మందికి అందించామన్నారు. మిగిలినవారికి కూడా మరో రెండు మూడు రోజుల్లో అందించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, గృహనిర్మాణ శాఖ ఏఈ షేక్ జానీబాష, తహసీల్దార్ కార్యాలయ ఇన్చార్జి సూపరింటెండెంట్ రామారావు, జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### రీ సర్వేకు రైతులందరూ సహకరించాలి

● గ్రామ సభలో తహసీల్దార్

పొన్నూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల నాటి భూముల రికార్డులను ప్రక్షాళన చేస్తూ చేపట్టిన రీ సర్వేతో భూ వివాదాలకు స్వస్తి చెప్పవచ్చని రైతులందరూ సర్వేకు సహకరించాలని మండల తహసీల్దార్ మహ్మద్ జియావుల్ హక్ అన్నారు. బుధవారం మండలంలోని పెదపాలెంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వే ప్రాజెక్టుపై రైతులకు గ్రామ సభ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జియావుల్‌హక్ మాట్లాడుతూ రీ సర్వే ద్వారా రైతులు ఎదుర్కొంటున్న భూ వివాదాలు నూరు శాతం పరిష్కారమవుతాయన్నారు. పొన్నూరు మండలంలో వల్లభరావుపాలెం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. రీ సర్వేలో పొరపాట్లకు తావులేకుండా అత్యాధునిక టెక్నాలజీతో జరుపుతున్నామన్నారు. ఈ నెలాకరుకల్లా రీ సర్వేను పూర్తి చేసే విధంగా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. తొలుత వీర్వోలు, విలేజ్ సర్వేయర్లు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మండల సర్వేయర్ అడపాల సత్యనారాయణ, వీర్వోలు, విలేజ్ సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

● ఎంపీడీవో ఎ.ఉమాదేవి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే 21 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో ఎ.ఉమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు వివిధ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధించేందుకు జీవో నెంబరు 31ని కఠినంగా అమలు పరచేలా అధికారులు బాధ్యతగా ఉండాలన్నారు. క్రాప్ జిల్లా సమన్వయకర్త సుకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారులు, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, క్రాప్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి

పెదకాకాని, మే 21 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34 వర్ధంతిని బుధవారం పెదకాకానిలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా డీసీసీ ఉపాధ్యక్షుడు జొన్నల వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు అమలుచేసిన అనేక సంస్కరణలను ఆయన వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీరావలి, ఇలా కిషోర్, గాద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మారీసుపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ విశేష కృషిచేశారని చెప్పారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, ద్వారక శ్రీనివాసరావు, బుల్లియ్య, శివకుమార్, స్టీవెన్‌బాబు, వీరస్వామి పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## వర్మీ కంపోస్ట్ యూనిట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మే 21 (ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టు యూనిట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా యానిమేటర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఇంట్లోనే వర్మీ కంపోస్ట్ తయారు చేసుకునే విధానంపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వర్మీ కంపోస్టును ప్రతి ఇంట్లో తయారు చేసుకుని పెరటిలో ఉన్న కూరగాయల మొక్కలకు అందించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి, ఏపీవో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు చెస్‌పై ఆసక్తి పెంపొందించాలి

● పొన్నూరు టౌన్ సీఐ వీరనాయక్

పొన్నూరు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పిల్లలను చదువుతో పాటు చదరంగం (చెస్) ఆట ఆడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పొన్నూరు పట్టణ సీఐ ఎల్. వీరనాయక్ చెప్పారు. బాలాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో స్థానిక జేఎంఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన అండర్-11 బాల, బాలికల చెస్ పోటీలలో విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ వీరనాయక్ గెలుపొందిన క్రీడాకారులను అభినందించి బహుమతులు అందించారు. జిల్లా చెస్ ప్రెసిడెంట్ రవీంద్రరాజు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ కీర్తి, డాక్టర్ హిమబిందు, సూర్యనారాయణ, గంగరాజు, మురళీకృష్ణ బాజీబాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.